క్లుప్తంగా

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

మాగనూర్: మండలంలోని గురువలింగంపల్లిలో ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీని శనివారం రాత్రి నియోజకవర్గ కన్వీనర్ కల్యాణ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా మహదేవ్, ఉపాధ్యక్షుడు సిద్ధప్ప, అధికార ప్రతినిధి గిర్ని నర్సిములు, ప్రధాన కార్యదర్శి మారెప్ప, కార్యదర్శులు పిల్లి అశోక్, కోశాధికారి శివప్ప, రాజు, నర్సములు, సిద్ధప్ప, హన్మంత్, అంజప్ప, కర్రెప్ప, బుగప్ప తదితరులతో కమిటీని ఎన్నుకున్నారు.

పట్టణ కమిటీ ఎన్నిక

నారాయణపేట టౌన్: పట్టణ ప్రగతి శీల మహిళా సంఘం సర్వసభ్య సమావేశం జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో ఆదివారం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మి అధ్యక్షత వహించారు. ముఖ్యవక్తగా రాష్ట్ర సహాయకార్యదర్శిగా జయలక్ష్మి మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించాలన్నారు. అనంతరం పట్టణ నూతన కార్యవర్గాన్ని ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా సునీత, ఉపాధ్యక్షురాలిగా రాధమ్మ, ప్రధాన కార్యదర్శిగా మంజుల, సహాయ కార్యదర్శులుగా చంద్రకళ, ఫాతిమా బేగం, కోశాధికారిగా మునిబేగం, కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు.

రాష్ట్ర కార్యదర్శిగా అంబదాస్

కోస్గి: టీటీడీపీ అనుబంధ విభాగం ఐ–టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా కోస్గి పట్టణానికి చెందిన అంబదాస్ ఆదివారం నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ నియామక పత్రం అందజేశారు. టీడీపీలో కొనసాగుతున్న తనను గుర్తించి రాష్ట్ర కార్యదర్శిగా నియమించిన పార్టీ అధిష్టానానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వైభవంగా మైసమ్మ జాతర

నర్వ: మండల కేంద్రంలో వెలిసిన మైసమ్మ దేవర జాతర ఉత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి మహిళలు బోనాలతో బయలుదేరి నైవేద్యాలు సమర్పించారు. ఆలయం ఆవరణలో కోళ్లు, మేకలు, పొటేళ్లను బలి ఇచ్చారు. గ్రామ పంచాయ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా కొండయ్య జన్మదిన వేడుకలు



మక్తల్: మండల కేంద్రంలోని వేంకటేశ్వర ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.కొండయ్య జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పడమటి ఆంజనేయ దేవాలయం, ఉమామహేశ్వర, వీరభద్రదేవాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్ కట్‌చేశారు. అంబేడ్కర్ చౌరస్తాలో క్రేన్ సహాయంతో ఆయనకు భారీ గజమాల వేశారు. కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పావని, వైస్ చైర్మన్ అఖిలరెడ్డి, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు

ఊట్కూరు: మండల కేంద్రంలోని ఎల్‌బీనగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం బీజేపీ రాష్ట్ర నాయకుడు కొండయ్య జన్మదినం సందర్భంగా ఆ పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, ఆకుపూజ తదితర పూజలు నిర్వహించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. భరత్, రమేష్, కృష్ణయ్యగౌడ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పూడుకుపోతున్న చెరువు కాల్వ



అమరచింత: అమరచింత పెద్ద చెరువును 15ఏళ్ల కిందట లిఫ్ట్ నీటితో నింపి ఆయకట్టుకు సాగునీరును అందించాలనే సంకల్పంతో నిర్మించగా, ప్రస్తుతం పూడుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. అమరచింత లిఫ్ట్ నుంచి పెద్ద చెరువును నీటితో నింపాలని అప్పట్లో ఎంపీ, ఎమ్మెల్యే నిధుల ద్వారా కాల్వ పనులు చేపట్టారు. వీటితో పాటు పనికి ఆహారపథకం ద్వారా మరోమారు నిధులు మంజూరు కావడంతో పూర్తి స్థాయిలో కాల్వ పూర్తయ్యింది. 12 ఏళ్లుగా లిఫ్ట్ నుంచి చెరువు కాల్వకు సాగునీరు వదలక పోవడం, ఐడీసీని తొలగించి ఇరిగేషన్ శాఖకు అప్పగించడంతో వీటి నిర్వహణ మరిచిపోయారు. దీంతో కాల్వలో భారీ చెట్లతో పాటు ముళ్లపొదలు కమ్ముకున్నాయి. మరమ్మతు చేయాలని రైతులు కోరుతున్నారు.

వర్షాకాలంలో జర జాగ్రత్త

మాగనూర్: వర్షాకాలంలో విద్యుత్‌కు సంబంధించిన విషయంతో రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని ఆశాఖ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. తెలిసి తెలియని పరిజ్ఞానంతో విద్యుత్ తీగలకు, మోటర్లకు మరమ్మతు చేయొద్దని సూచిస్తున్నారు. స్తంభాలు ఉన్న చోట యంత్రాలతో దుక్కి దున్నే క్రమంలో పొరపాటున విద్యుత్ స్తంభాలను తాకితే ప్రమాదాలబారిన పడొచ్చు. పొలాల్లో తీగలు కింద వేలాడితే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరుతున్నారు. వానాకాలం పంటలు సాగు చేసే రైతులు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి.

మోటార్లు బిగించే క్రమంలో ..

పంటల సాగు చేసే రైతులు వేసవికాలంగా మోటార్లు తీస్తారు. వర్షాకాలం ప్రారంభమైన తర్వాత బిగిస్తారు. వర్షం కురుస్తున్న వేళలో మోటర్లకు మరమ్మతు చేయొద్దని అధికారులు సూచిస్తున్నారు. ప్రతి రైతు వ్యవసాయ మోటారుకు నాణ్యమైన విద్యుత్ వైరును వాడాలని స్టార్టర్లను సురక్షితంగా ఉండే ప్రదేశంలో అమర్చాలని కోరుతున్నారు. మోటారు చుట్టూ పచ్చ గడ్డి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. సరైన రక్షణ కవచం లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అధికారుల పేర్కొంటున్నారు.



విద్యుత్ మరమ్మతులను పరిశీలిస్తున్న ఏఈ



మాగనూరులో మొదలైన వ్యవసాయ పనులు

అవగాహన కల్పించాలి..



పంట పొలాల్లో విద్యుత్ వినియోగంపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలి. వర్షాకాలంలో విద్యుత్ సమస్య తలెత్తుతాయి. రైతులు సొంతంగా మరమ్మతు చేసి ప్రమాదాలబారిన పడుతున్నారు. రైతులు వినియోగించే మోటార్ల సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించి రైతులను అప్రమత్తం చేయాలి.

– వెంకటయ్య, రైతు, మాగనూర్.

అధికారులను సంప్రదించాలి..



రైతులు విద్యుత్ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలి. విద్యుత్‌కు సంబంధించిన సమస్యలు వస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలి. ప్రమాదాలు జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటాం. ముందుజాగ్రత్తగా సిబ్బందికి అవగాహన కల్పించాం.

– దేవేంద్రనాయుడు, ఏఈ, మాగనూర్

అన్నపూర్ణదేవికి ప్రత్యేక పూజలు



అన్నపూర్ణమాతకు ప్రత్యేక పూజలు

దామరగిద్ద: మండలంలోని క్యాతన్‌పల్లి వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో అన్నపూర్ణదేవీ ఐదవ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శరణయ్యస్వామి అన్నపూర్ణ మాతకు అభిషేకం అర్చన పూజలు చేపట్టారు. విగ్రహ ప్రదాత కానగడ్డ శివరాజప్ప, సువర్ణమ్మ కుటుంబ సమేతంగా అమ్మవారి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు నారాయణ, శరణప్ప, గురులింగప్ప అర్చకులు శరణయ్యస్వామి, శివకుమార్ స్వామి చెన్నయ్యస్వామి పాల్గొన్నారు.

కేబుల్ వైర్ల దొంగలను పట్టుకోవాలి

నర్వ: మండలంలోని యాంకి, బెక్కర్‌పల్లి గ్రామాల మధ్యనున్న భూత్పూరు కెనాల్‌పై గుర్తుతెలియని వ్యక్తులు పదిహేను రోజుల కిందట మోటర్లతో పాటు కేబుల్ వైర్లను ఎత్తుకెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు చేసినటప్పటికి దర్యాప్తులో నిర్లక్ష్యం వహిస్తున్నారని జెడ్పీటీసీ గౌని జ్యోతికిరణ్‌ప్రకాష్‌రెడ్డిలు తెలిపారు. వెంటను దుండగులను పట్టుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

జనగర్జనకు తరలిన నాయకులు



మరికల్: ఖమ్మంలో నిర్వహించిన కాంగ్రెస్ జనగర్జనకు మరికల్ నుంచి ఆదివారం నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు వీరన్న మాట్లాడుతూ కాంగ్రెస్‌కు లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే జనగర్జనను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో హరీష్, మొగులప్ప, అంజిరెడ్డి, చెన్నయ్య, మల్లేష్ ఉన్నారు.

కరపత్రాల విడుదల

నారాయణపేట రూరల్: వీరశైవ లింగాయత్ – లింగబలిజ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందిస్తున్నట్లు ఆ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మల్లేపల్లి రాచప్ప తెలిపారు. శివలింగేశ్వర ఆలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. యువజన విభాగం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో విద్యారంగంలో చిన్నారులను ప్రోత్సహించాలనే సంకల్పంతో కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ఆగస్టు 6న హైదరాబాద్‌లో పురస్కారాలు అందించనున్నట్లు వివరించారు. అనంతరం కరపత్రాలు విడుదల చేశారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గాజుల శివకుమార్, జిల్లా అధ్యక్షుడు గండెరవికాంత్, ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి ల్యాబ్‌శివకుమార్, కోషాధికారి అర్కంచి రవికుమార్, మంగళ్లి సచిన్, మహిళ సమాజం సభ్యులు పాల్గొన్నారు.



కరపత్రాలతో నాయకులు

వృథాగా సీసీ కెమెరాలు



తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో వృథాగా సీసీ కెమెరా

మాగనూర్: ప్రభుత్వ కార్యాలయాలో విలువైన పత్రాలు, వస్తువుల భద్రత, ప్రభుత్వ సిబ్బంది రక్షణ కోసం ప్రభుత్వం రూ.వేలు వెచ్చించి తహసీల్దార్ కార్యాలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా అవి మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు వృథాగా దర్శనమిస్తున్నాయి. కొన్నాళ్లు సజావుగా పనిచేసినా ప్రస్తుతం మరమ్మతుకు నోచుకున్నాయి. అధికారులు తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సీసీ కెమెరాలకు మరమ్మతు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్



మద్దూరు: ఆటోలో మర్చిపోయిన పర్సును పోలీస్ స్టేషన్‌లో ఓ ఆటో డ్రైవర్ అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు. ఎస్‌ఐ శీనయ్య వివరాల ప్రకారం నారాయణపేట మండలంలోని బండగొండ గ్రామానికి చెందిన సాయిశ్రీ మద్దూరుకు ఆటోలో వెళ్లింది. తొందరపాటులో ఆటోలోనే పర్సు మరిచిపోయింది. కొంతసమయానికి పర్సు లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో మహిళ ఫిర్యాదు చేసింది. ఇంతలోనే మద్దూరుకు చెందిన ఆటో డ్రైవర్ రాఘవేందర్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఓ మహిళ పర్సు మరిచిపోయిందని పోలీసులకు అప్పగించాడు. దీంతో బాధితురాలికి పర్సు అప్పగించారు. ఆటోడ్రైవర్ నిజాయితీని మెచ్చుకొని ఎస్‌ఐ, పోలీసులు అభినందించి, శాలువాతో సన్మానించారు.

పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

మరికల్: గ్రామ పంచాయతీలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నర్సిములు అన్నారు. ఆదివారం మరికల్‌లో ఏర్పాటు చేసిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీ సిబ్బందిని వెంటనే పర్మనెంట్ చేయాడానికి ప్రభుత్వంపై ఒత్తడి తీసుకొస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. జీవో 60 ప్రకారం వారికి వేతనాలు పెంచాలని, అలగే మల్టీపర్సన్ విధానం రద్దు చేయాలన్నారు. సమస్యలపై జూలై 6 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సమ్మె జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కాశప్ప, రాజు, రఘుమూర్తి, బుచ్చన్న, చెన్నప్ప, బాలప్ప, ఆంజనేయులు, లక్ష్మన్, అనసూయ, సత్యమ్మ, మహేశ్వరమ్మ, కుర్మక్క పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

గురుపౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు



కోస్గిలో..



విద్యుత్ కాంతుల్లో సాయి హనుమాన్ మందిరం

నారాయణపేట టౌన్: జిల్లాలోని పలు ఆలయాలు గురుపౌర్ణమి వేడుకలకు ముస్తాబయ్యాయి. జిల్లాకేంద్రంలోని సాయివిజయ్ కాలనీలో వెలసిన సాయి హనుమాన్ మందిరంలో సోమవారం ఉదయం 5 గంటలకు కాకడహారతి, గణపతిపూజ, క్షీరాభిషేకం, పుష్పాభిషేకం, మధ్యాహ్న మంగళహారతి అనంతరం 12.30 గంటలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. అదేవిధంగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు డా. మదన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యేలు ఎస్. రాజేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అడిషన్ కలెక్టర్ మయాంక్ మిట్టల్, జిల్లా ఎస్పీ వెంకటేశ్వర్లు తదితరులు వేడుకల్లో పాల్గొంటారని ఆలయ కమిటీ సభ్యులు వివరించారు. సుభాష్‌రోడ్‌లోని శ్రీ అవదూత మఠంలో గురు పౌర్ణమి సందర్భంగా సోమవారం వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

కోస్గి: పట్టణంలోని షిర్డిసాయి బాబా మందిరంలో సోమవారం గురు పౌర్ణమి వేడుకలను నిర్వహించనున్నట్లు లక్ష్మీ వెంకటేశ్వర శివసాయి అయ్యప్ప ఆలయ కమిటీ ప్రతినిధులు ఆదివారం తెలిపారు. ఉదయం 5:15 నుంచి రాత్రి 9:00 గంటల వరకు ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వివరించారు. భక్తులు, రైతులు హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

ఊట్కూరు: మండల కేంద్రంలోని శిశుమందిర్ ఆవరణలో ఆదివారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. సందర్భంగా స్వయం సేవకులు జగన్నాథ్‌రావు గురుపూజోత్సవ విశిష్టతను వివరించారు. అనంతరం గురుదక్షిణ సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగప్ప, బీంరాజు, కేశరావు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జగన్నాథ్‌రావు

కోటకొండపై వివక్ష తగదు

నారాయణపేట రూరల్: కోటకొండను మండలంగా ఏర్పాటు చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వివక్ష విడనాడాలని సాధన సమితి కో కన్వీనర్ యాదగిరి అన్నారు. 54వ రోజు దీక్షలకు ఆదివారం విశ్వకర్మ–విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ఐదు కొత్త మండలాలను అందించి ప్రజల ఆకాంక్షలతో ఉద్యమం చేస్తున్నా కోటకొండను పట్టించుకోకపోవడం విడ్డూరమని అన్నారు. ఎమ్మెల్యే చొరవ తీసుకుని నియోజకవర్గంలో కానుకుర్తి, గార్లపహాడ్‌లతో కలిపి కోటకొండను మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. వెంకటస్వామి, ఎల్లరాజు, కాలప్ప, కృష్ణ, కిషోర్, మహేష్, భాను, భాస్కర్, ప్రభంజన్‌రావు, ప్రవీణ్, హన్మంతు, బాలప్ప తదితరులు పాల్గొన్నారు.



కోటకొండ దీక్ష శిబిరంలో మాట్లాతున్న యాదగిరి

ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ రవిబాబు

నారాయణపేట రూరల్: పట్టణంలోని ఆటో డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ రవిబాబు అన్నారు. స్థానిక బస్టాండ్ ఎదురుగా ఆదివారం సాయంత్రం సీఐ మాట్లాడుతూ.. ప్రతీ ఆటో కండీషన్‌లో ఉంచాలని, ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. భద్రత, బాధ్యతతో పాటు నమ్మకంగా గమ్య స్థానంలో వదిలివేయాలన్నారు. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయడం, ఇతర వాహనాలకు ఇబ్బంది కల్గించే విధంగా డ్రైవింగ్ చేయడం సరికాదన్నారు. ప్రతీ వాహనానికి నంబర్‌ప్లేట్ ఉండాలని, లేకపోతే సదరు వాహనాలను క్రైమ్ చేయడానికి వాడుతున్నారని గుర్తించాల్సి వస్తుందన్నారు. నిబంధనల ప్రకారమే నంబర్ ప్లేట్ ఏర్పాటు చేయాలని, ఇష్టారీతిగా ఉండరాదని సూచించారు. అతి వేగం ఎంతో ప్రమాదకరమని, నిర్ణీత వేగంతోనే వాహనాలను నడపాలని, మద్యం సేవించి నడిపితే కేసులు నమోదు చేస్తామని, ఫైన్ కట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

నారాయణపేట రూరల్: ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహారెడ్డి, జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని శ్రీసాయి జూనియర్ కళాశాలలో ఆదివారం ఆ సంఘం జిల్లా కార్యవర్గ, మండల బాధ్యుల అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని, టీచర్లు ఎంతో ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెలలో చెల్లించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వెంటనే ప్రభుత్వం పీఆర్‌సీ ప్రకటన చేసి పాఠశాలల్లో స్కావింజర్లను నియమించాలన్నారు. విద్యాబోధనకు సరిపడ టీచర్లు లేని చోట్ల వలంటీర్లను ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. పాఠశాల గ్రాంట్స్ సరిపోక ఇబ్బంది పడుతున్న హెచ్ఎంలను దృష్టిలో ఉంచుకుని ఉచిత కరెంటును అందించాలని కోరారు. పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందేవిధంగా చర్యలు చేపట్టాలని, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు బకాయి లేకుండా చూడాలన్నారు. సమావేశంలో గౌరవ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, రఘువీర్, సత్యనారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, మొల్గాన్‌జనార్దన్, భాస్కర్, తిమ్మన్న పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి హయాంలోనే నియోజకవర్గ అభివృద్ధి

మద్దూరు: కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి రేవంత్‌రెడ్డి హయాంలోనే జరిగిందని జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహా అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆరోపణ చేసినా నేపథ్యంలో ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పల్లెర్ల సబ్‌స్టేషన్, కోస్గి బస్‌డిపో కోసం రేవంత్‌రెడ్డి స్థలాలను కొని అభివృద్ధికి సహకరించారని గుర్తు చేశారు. మహిళ డిగ్రీ కళాశాల తీసుకొస్తానన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఇప్పటివరకు డబుల్‌బెడ్రూం ఇళ్లు మంజూరు కాలేదని విమర్శించారు. అసత్య ఆరోపణలు మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ్, రమేష్‌రెడ్డి, శివరాజ్, మహేందర్‌రెడ్డి, మల్లికార్జున్, రహీం, వెంకటేష్, బాల్‌రాజ్, భీములు, హుసేన్, చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మురుగుతో విద్యార్థుల అవస్థలు



బోరుబావి పక్కన బురద

మాగనూర్: మండలంలోని వర్కూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలోని బోరుబావి చుట్టూ మురుగు నిల్వ ఉంది. పరిసరాలు బురద మయంగా మారాయి. మధ్యాహ్న భోజనం అనంతరం పాఠశాల విద్యార్థులు గిన్నెలను శుభ్రం చేయడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు విద్యార్థులు జారిపడి గాయాలైన ఘటనలు ఉన్నాయి. నడిచేందుకు కూడా వీలు లేకుండా బురద ఉందని విద్యార్థులు వాపోయారు. ప్రస్తుతం వర్షాలు మొదలు కావడంతో సమస్య మరింత జఠిలం అయ్యే అవకాశం ఉందని పలువురు పేర్కొన్నారు. పాఠశాలల ఆవరణలో అంగన్‌వాడీ కేంద్రం కూడా ఏర్పాటు చేశారని చిన్నారులు కూడా నానా అవస్థలు పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి బోరుబావి చుట్టూ మొర్రం వేయించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

జోరుగా మట్కా

మాగనూర్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో జోరుగా మట్కా జూదం కొనసాగుతుంది. మండల కేంద్రంలోని పలు ప్రధాన కూడళ్లను అడ్డాలుగా చేసుకుని కొందరు మట్కా ఏజెంట్లు జూదాన్ని నిర్వహిస్తున్నారు. రోజుకు రూ. వేలలో మట్కా నిర్వాహకులకు అందుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. మహారాష్ట్రకు చెందిన కల్యాణి, మిలాన్ అనే రెండు సంస్థలు మట్కా జూదాన్ని నిర్వహిస్తునట్లు ఆయా గ్రామాల ప్రజలు పేర్కొన్నారు. గతంలో పేపర్ల మీద నెంబర్లు రాసుకునే వారు. కానీ ప్రస్తుతం పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా వాట్సప్, మెసెజ్‌ల ద్వారా నిర్వాహకులకు నెంబర్లు చేరవేస్తునట్లు సమాచారం. రూ.100 లకు రూ.900 వస్తాయని అమాయకులను మోసగిస్తున్నారు. ఇలా వందలో కాకుండా వేలలో డబ్బులు పెట్టి దివాలా తీసిన కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. ఈ నెంబర్లు ఓపెన్, క్లోజ్ అని రెండు సార్లు డబ్బులు కట్టించుకొని మోసాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలో 60 శాతం మంది మట్కా జూదంలో డబ్బులు పొగొట్టుకుని జీవితాలు నాశనం చేసుకున్నారని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా పోలీసు యంత్రాంగం నిఘా పెంచి అరికట్టాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.